# ప్రముఖులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



మాజీ మంత్రి హరీశ్‌రావు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ శ్రేణులు



ఎమ్మెల్సీ కవితను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మెదక్ బీఆర్ఎస్ నేతలు



మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మెదక్ బీఆర్ఎస్ నేతలు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 2: నూతన సంవత్సరం పురస్కరించుకుని మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితకు మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ గురువారం శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని కోకాపేటలోని నివాసంలో మాజీ మంత్రి హరీశ్‌రావును, జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నివాసంలో, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డిని మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కో కన్వీనర్ గడ్డమీది కృష్ణాగౌడ్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, జయరాజ్, ఆర్‌కె శ్రీనివాస్, కిశోర్, నాయకులు ప్రభురెడ్డి, మధు, మహేశ్ యాదవ్, తరుణ్, బీఆర్ఎస్వీ నాయకులు కిరణ్, అరుణ్, రంజిత్ నాయక్, లడ్డు తదితరులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని శాలువాలు కప్పి సన్మానించారు.



హైదరాబాద్‌లోని కోకాపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావును బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సరపు శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన సహకార సంఘం ఏర్పాటు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న ఐదు గ్రామాల రైతులు, నాయకులు

చిలిపిచెడ్, జనవరి 2: మండలంలోని సోమక్కపేట సొసైటీ నుంచి తీసి మండలంలోని ఐదు గ్రామాలను కలుపుతూ మరో సహకార సంఘం ఏర్పాటు చేయాలని ఐదు గ్రామాల రైతులు కోరారు. గురువారం జిల్లా సహకార సంఘం ఇన్‌చార్జి కరుణాకర్‌కు అజ్జమర్రి మాజీ సర్పంచ్ పరాశురాం రెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా సభ్యుడు సయ్యద్ హుస్సేన్, రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. మండలంలోని ఫైజాబాద్, బండపోతుగల్, అజ్జమర్రి, గంగారం, జగ్గంపేట గ్రామాలను కలిపి మరో సహకార సంఘం ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు షఫీయొద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, రాఘవరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ, అదనపు కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోలు



మెదక్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్, ఎస్పీ, జడ్పీ కార్యాలయాల్లో ఎస్పీ ఉదయ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ మెంచు నగేశ్, అదనపు ఎస్పీ మహేందర్, జడ్పీ సీఈవో ఎల్లయ్యను టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఫజలుద్దీన్, కోటి రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు పోతురాజు శంకర్, రాధా, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆరేళ్ల రామాగౌడ్, శేషాచారి, సుకుర్, ప్రణయ్, మహేందర్, సత్యనారాయణ, సంగమేశ్వర్లు తదితరులు కలిశారు.



## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సీఐ



రామాయంపేట, జనవరి 2: రామాయంపేట సర్కిల్ కార్యాలయంలోని సీఐ వెంకటరాజాగౌడ్ క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. రామాయంపేట ఎస్సై బాలరాజు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మానెగల్ల రామకిష్టయ్య, భాను ఉన్నారు.

## పేద విద్యార్థులకు అండగా ఉంటాం



రామాయంపేట, జనవరి 2: పేద విద్యార్థులకు తమవంతు సేవలు అందిస్తూ, అండగా ఉంటామని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి, రోటరీ క్లబ్ వ్యవస్థాపక సభ్యుడు విక్రం మెహతా, సత్యసాయి సేవా సమితి సభ్యుడు సాయికుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఝాన్సీలింగాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డెస్కులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్యామ్‌సుందరాచార్యులు, టీచర్లు వెంకటేశం, రాజ్‌కుమార్, మన్నె గోపాల్, సుదర్శన్, శ్రీనివాస్, రమేశ్, దేవేందర్ ఉన్నారు.

## సొంత డబ్బులతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయిస్తున్న కౌన్సిలర్ లతా రమేశ్‌యాదవ్

నర్సాపూర్, జనవరి 2: నర్సాపూర్ మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ లతా రమేశ్ యాదవ్ సొంత డబ్బులతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లతా రమేశ్‌యాదవ్ మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపల్ రెండో వార్డులోని పలు వీధుల్లో కొన్ని రోజులుగా విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్నారని,ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ప్రజలు కోరిన వెంటనే సొంత నిధులతో ఐదు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు.

## ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

నిజాంపేట, జనవరి 2: మండల వ్యాప్తంగా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో రాజిరెడ్డి కార్యదర్శిలకు సూచించారు.ఈ మేరకు గురువారం మండలంలోని బచ్చురాజ్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇండ్ల సర్వే సరళిని పరిశీలించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు రాములు,ప్రశాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### అక్కన్నపేటలో ఇందిరమ్మ సర్వే

రామాయంపేట, జనవరి 2: రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలోని ఇందిరమ్మ ఇంటింటి సర్వేలు జోరుగా కొనసాగుతున్నాయి. గ్రామ కార్యదర్శి సరిత ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులను గుర్తించి సర్వే చేపట్టారు. పూర్తి స్థాయి నివేదికలను కలెక్టర్‌కు అప్పగిస్తామని తెలిపారు.

## పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 2: పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనపూర్ ఎంఈవో కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, మండల విద్యాధికారి మధుమోహన్, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సుభాష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బాధ్యులు త్యార్ల శ్రీనివాస్, శివరాజ్, సంగమేశ్వర్, యూనుస్, గంగమణి, సంతోషి, స్రవంతి, వెంకటేశ్వర్, సత్యనారాయణ, యాదిలాల్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### టేక్మాల్‌లో..

టేక్మాల్, జనవరి 2: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 2025 నూతన క్యాలెండర్‌ను టేక్మాల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ యశ్వంత్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ ప్రత్యుమ్నరెడ్డి, సహకార సంఘం, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

# ట్రాలీ ఆటో బోల్తా.. 20 మందికి గాయాలు



ఘటన స్థలంలో పడిఉన్న మహిళలు



వైద్యం కోసం క్షతగాత్రులను తరలిస్తున్న స్థానికులు



క్షతగాత్రులను వైద్యం కోసం తరలిస్తున్న స్థానికులు

- ఐదుగురు మహిళల పరిస్థితి విషమం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- క్షతగాత్రులకు మెరుగైన సేవలందించాలని ఆదేశం

శివ్వంపేట, జనవరి 2: పేద కుటుంబాలకు చెందిన 20 మంది మహిళలు ప్రయాణిస్తున్న టాటాఏస్ ట్రాలీ బోల్తాపడి పలువురికి తీవ్ర గాయాలైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నగొట్టిముక్ల శివారులో గురువారం జరిగింది. ఎస్సై మధుకర్‌రెడ్డి, బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండలం లక్ష్మాపూర్ శివారులో కొన్నిరోజులుగా పలు మండలాల్లోని పేద కుటుంబాలకు చెందిన వారు కస్టోడియన్ భూముల్లో గుడిసెలు వేసేందుకు పొదలు తొలిగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్లకు చెందిన పేద కుటుంబాలకు చెందిన 20 మంది మహిళలు కస్టోడియన్ భూముల్లో చదును కోసం లక్ష్మాపూర్ గ్రామానికి వెళ్తున్నారు. అక్కడ గుమ్మడిదల పోలీసులు వారిని అడ్డగించి, పలువురిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. ఇది గమనించిన మహిళలు గుమ్మడిదల పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాలో పాల్గొనేందుకు టాటాఏస్ ట్రాలీలో వెళ్తున్నారు. చిన్న గొట్టిముక్కుల శివారులోని టిక్యా దేవమ్మగూడ పంచాయతీ సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో చెట్టుకు ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలు అందరూ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న శివ్వంపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితి విషమంగా ఉన్న ఐదుగురిని సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. స్వల్పంగా గాయపడ్డ బాధితులను శివ్వంపేటలో చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులను పలువురు నాయకులు రాజిరెడ్డి, నవీన్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి పరామర్శించారు.

### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి



సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే

నర్సాపూర్, జనవరి 2: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మెడికల్ ఆఫీసర్ పావనిని ఆదేశించారు. గురువారం శివంపేట్ మండలం చిన్నగొట్టిముక్కల గ్రామ శివారులో టాటా ఏసీ ట్రాలీ ఆటో బోల్తాపడి సుమారు 10 మందికి పైగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రోడ్డు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తీవ్ర గాయాలైన వ్యక్తులను సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వారికి కూడా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. గాయాలపాలైన వారు త్వరగా కోలుకోవాలని కోరారు.

## పద్మశాలీల ఐక్యతకు కృషి చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రాజ్‌కుమార్

శివ్వంపేట, జనవరి 2: రాష్ట్రంలోని పద్మశాలీల ఐక్యతకు కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని దంతాన్‌పల్లి గ్రామంలో పద్మశాలి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల వెంకటేశం, గౌరవ అధ్యక్షుడు వేముల బాల్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు మేకల జయరాములు, బీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, బొడ్డు రవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చిన్నశంకరంపేట, జనవరి 2: మండలంలోని కామారంతండా, మిర్జాపల్లి, మిర్జాపల్లితండా, చందంపేటలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు లయన్స్‌క్లబ్ మౌలాలి వారి సహకారంతో గురువారం కంటి పరీక్షలు చేయించారు. కంటి శస్త్ర చికిత్స అవసరం ఉన్న వారికి హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ దవాఖానలో ఉచితంగా చేయిస్తామని ఎంఈవో పుష్పవేణి తెలిపారు. ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు ఎమ్మెస్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు

### జడ్పీ మాజీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్



చెక్కులు అందజేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్

మనోహరాబాద్, జనవరి 2: కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిందని, హామీలను నెరవేర్చకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 2.80 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా, ఇప్పటి వరకు గజ్వేల్ నియోజకవర్గంలో పది రూపాయల పని జరగలేదన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిని, ఆయన జ్ఞాపకాలను చెరిపేయడమే లక్ష్యంగా రేవంత్ సర్కార్ ముందుకు సాగుతుందే తప్ప, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలనే ధ్యాసే లేదన్నారు. హైదరాబాద్ నగరవాసులు కాంగ్రెస్‌కు ఓటేయలేదనే కక్షతో పేదల ఇండ్లను కూలగొట్టడం దారుణమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సర్పంచ్, ఎంపీటీసీ, మున్సిపల్, జడ్పీటీసీ స్థానాలు గెలుచుకుని బీఆర్ఎస్ జెండాను రెపరెపలాడించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రతన్‌లాల్, సీనియర్ నాయకులు దాసరి నరేశ్ ముదిరాజ్, స్వామి, భిక్షపతి, శైలేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చిలిపిచెడ్,జనవరి 2ఃనర్సాపూర్ నియోజకవర్గం ప్రజల కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి ఎంతో కృషి చేస్తుందని మాజీ ఎంపీటీసీ మల్లయ్య,గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు.గురువారం అజ్జమర్రి గ్రామానికి చెందిన ఐదుగురి లబ్ధిదారులకు సంబంధించిన రూ.94వేల చెక్కులు నాయకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాల్‌రాజు,పోచయ్య,యాగయ్య,సత్యం,శ్రీశైలం, తదితరలు గ్రామస్తులు,ఉన్నారు.

## కొనసాగుతున్న చెరువులు, కుంటల సర్వే



వెంకటాయపల్లిలోని తెట్టె కుంటలో సర్వే నిర్వహిస్తున్న ఇరిగేషన్ అధికారులు

తూప్రాన్, జనవరి 2: మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటల సర్వే కొనసాగుతున్నది. గురువారం వెంకటాయపల్లి తెట్టె కుంటలో సర్వే నిర్వహించారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల హద్దులు గుర్తించారు. తెట్టె కుంట విస్తీర్ణం 17.8 గుంటల భూమి ఉండగా కుంట పరిసర రైతులకు హద్దులు చూపించారు. చెరువులు, కుంటల్లో ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపట్టవద్దని ఇరిగేషన్ శాఖాధికారులు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా, ఎప్పటికైనా కూల్చివేతలు తప్పవని హెచ్చరించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ కిషన్, లస్కర్, శ్రీను, నాగరాజు, నర్సింలు తదితరులున్నారు.

## నాణ్యతతో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు చేయాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ఏఈ మారుతి

చిలిపిచెడ్, జనవరి 2: మండలంలో కొనసాగుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పలు నాణ్యతతో నిర్మించాలని పీఆర్ఏఈ మారుతి పేర్కొన్నారు. గురువారం చిలిపిచెడ్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం ఏఈ మాట్లాడుతూ పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఆయన వెంట కాంట్రాక్టర్ అనిల్, గ్రామస్తులు ఉన్నారు.

# సమగ్ర శిక్షా ఉద్యోగులపై సర్కారు కన్నెర్ర




జహీరాబాద్ మండల వనరుల కేంద్రంలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

- టీచర్లు లేక వెలవెలబోతున్న కేజీబీవీలు
- సమ్మెతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం



మెదక్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె




మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామంలో మూతపడిన మండల వనరుల కేంద్రం

రామాయంపేట/ జహీరాబాద్, జనవరి 2: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె ప్రభావంతో ఎమ్మార్సీ కార్యాలయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. కేజీబీవీల్లో విద్యాబోధన కుంటుపడుతున్నది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఉద్యోగులు చేస్తున్న సమ్మెతో పలు మండలాల్లో ఈ పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఉద్యోగలు, సిబ్బంది సమ్మెబాట పట్టడంతో ఎమ్మార్సీ కార్యాలయాలు, కేజీవీబీ పాఠశాల, కళాశాల్లో పనులు, విద్యాబోధనపై తీవ్ర ప్రభవం చూపుతున్నది. ఆయా మండలాల్లోని ఎమ్మార్సీ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది లేక మూతపడ్డాయి. రోజూ ఉద్యోగులు, సిబ్బంది పాఠశాలలు సందర్శించి ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్నం భోజనం వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. బడి బయట పిల్లలను గుర్తించి వివరాలను యూడైస్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఏకో ఉపాధ్యాయ పాఠశాలల్లో టీచర్లు సెలవుపై వెళ్లినప్పుడు ఆ క్లస్టర్ పరిధిలోని సీఆర్పీ ఆ పాఠశాలను నడిపించాల్సి ఉంటుంది. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం, పాఠశాల ఖర్చుల వివరాలు సేకరించి డీఈవోకు అందజేయాల్సి ఉంటుంది. ఎమ్మార్సీలో కంప్యూటర్ విద్యకు సంబంధించిన ప్రతిదీ నమోదు చేయాల్సి ఉంటుంది. సమ్మెతో ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం వేయడంతో అ పనులన్నీ పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నెలాఖరులోగా పదో తరగతి సిలబస్ పూర్తి చేయాల్సి ఉంది. మార్చిలో ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండడంతో రివిజన్, ప్రత్యేక తరగతులతో పాటు స్లిప్ టెస్టులు నిర్వహించాల్సి ఉంటుంది. వారి సమ్మెతో పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్ష ఫలితాలపై తీవ్ర ప్రభావం పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు నష్టపోకుండా ఉపాధ్యాయులు, అధ్యాపకులను విడతల వారీగా సమ్మెలో పాల్గొంటున్నారు. వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు నష్టపోకుండా ఉపాధ్యాయులు, అధ్యాపకులను సర్దుబాటు చేసే బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. ఉద్యోగులు, సిబ్బంది న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

### ఉద్యోగ భద్రతను కల్పించాలి



ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలి. కేజీబీవీలో పదో తరగతి ప్రత్యేక క్లాసులు నిలిచిపోయాయి. చదువులు కొనసాగాలంటే తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. తమకు ఉద్యోగ, ఆరోగ్య భద్రతతో పాటు పనికి తగ్గ వేతనం ఇవ్వాలి. సీఎం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి.

**- కృష్ణతేజ, కేజీబీవీ టీచర్, మాసాయిపేట**

### హామీలు వెంటనే నెరవేర్చాలి



ప్రభుత్వ హామీ మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి. అప్పటి వరకు ఉద్యోగులు, సిబ్బందికి పే స్కేలు ఇవ్వాలి. ప్రతి ఉద్యోగికి రూ.10 లక్షల జీవిత బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి. ఉద్యోగ విద్య విరమణ చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు చెల్లించాలి. పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌కు 12 నెలల వేతనం ఇవ్వాలి. ప్రభుత్వం వెంటనే తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి. లేనికుంటే తమ సమ్మెను నిరవధికంగా కొనసాగిస్తాం.

**– రవి, మండల అధ్యక్షుడు, న్యాల్‌కల్**